ఈనాడు
తూర్పుగోదావరి
మంగళవారం డిసెంబరు 23, 2025


# అనుమతులున్నా.. పైకం కట్టాల్సిందే..!

## ఇసుక రీచ్‌ల వద్ద వసూళ్ల పర్వం

ఈనాడు, రాజమహేంద్రవరం: ప్రజలకు ఉచితంగా ఇసుక ఇవ్వాలన్న ఉద్దేశంతో ప్రభుత్వానికి సీనరేజీ ద్వారా వచ్చే ఆదాయాన్ని సైతం వదులుకుని పక్కాగా అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచిస్తే క్షేత్రస్థాయిలో దీనికి భిన్నమైన పరిస్థితులు నెలకొంటున్నాయి. టెండర్లలో ఇసుక రీచ్‌లు దక్కించుకున్నా.. పట్టా భూముల్లో తవ్వకాలు అనుమతులు తీసుకున్నా ఇసుక తవ్వి తరలించాలంటే పైకం ముట్టజెప్పాల్సిందేనంటూ ఇద్దరు నాయకుల ఆంక్షలు హెచ్చుమీరుతున్నాయి.

### ఎకరాకు రూ.లక్ష ఇస్తేనే

ఇసుక తవ్వకాలు పునఃప్రారంభమైన తరవాత జిల్లాలోని 15 ప్రాంతాల్లోని పట్టాభూముల్లో తవ్వకాలకు జిల్లా ఇసుక కమిటీ అనుమతులిచ్చింది. ఆ భూముల్లో తవ్వకాలు చేయాలంటే ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు కప్పం కట్టాలని ఓ నాయకుడు ఆదేశించినట్లు తెలిసింది. అనుమతులు పొందిన వారిలో కొందరు కీలక నాయకులు ఉండటంతో వారికి మినహాయింపులిచ్చినట్లు సమాచారం. ఇప్పటికే నలుగురైదుగురు నిర్దేశిత మొత్తం చెల్లించినట్లు తెలిసింది.

### వివిధ దశల్లో అనుమతులు

జిల్లాలో 15 ప్రాంతాల్లో 141.138 హెక్టార్లు (352 ఎకరాలు)లో తవ్వకాలు చేసేందుకు జిల్లా యంత్రాంగం అనుమతులిచ్చింది. వీటి ద్వారా 63,16,943 టన్నుల ఇసుక తరలే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. మరో 38 ప్రాంతాల్లో 253.847 హెక్టార్ల పట్టా భూముల్లో ఇసుక తవ్వేందుకు దరఖాస్తులు రాగా అనుమతులకు వివిధ దశల్లో ఉన్నాయి.

# మంత్రి ఆదేశించినా..! ఆక్రమణలు మామూలే

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: పుష్కరాలకు వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకొని రహదారులు, కాలువలను విస్తరించాలని మంత్రి నారాయణ అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. ఇటీవల నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆక్రమణలపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. రోడ్లు విస్తరించాలంటే ముందుగా ఆక్రమణలు తొలగించాలి. ఇందుకుగాను నగరంలో రద్దీగా ఉన్న రహదారులు, వాటి పరిధిలోని ఆక్రమణలు గుర్తించారు. తొలుత మూలగొయ్యి, జాంపేట, ఆజాద్‌చౌక్, కంబాలచెరువు ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగింపు ప్రారంభించారు. ఈ ప్రక్రియ మధ్యలోనే నిలిచిపోయింది. దీంతో తొలగించిన చోట మళ్లీ ఆక్రమణలు వెలిశాయి. ఏకంగా నడకదారులపై దుకాణాలు, రోడ్డుపైనే వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ఇక్కడ 40 నుంచి 60 అడుగుల రోడ్డు ఉన్నప్పటికీ కనీసం వెళ్లేందుకు 20 అడుగుల కూడా కనిపించకపోవడం గమనార్హం. దుకాణాలు రోడ్డుపైకి వస్తే, కొనుగోళ్లు కోసం వచ్చిన వాహనదారుల వాహనాలు రోడ్డు సగం ఆక్రమించేస్తున్నాయి. దీంతో ఉన్న సగం రోడ్డులోనే వాహనాలు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. నగరంలో ప్రధాన ప్రాంతాల్లో ఇదే దుస్థితి నెలకొంది. దేవీచౌక్, మెయిన్ రోడ్డు, జాంపేట, గోరక్షణపేట, కోరుకొండ రోడ్డు, కోటిపల్లి బస్టాండ్ రోడ్డు, అప్సరా థియేటర్ రోడ్డు, కోటగుమ్మం, డీలక్స్ సెంటర్ తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొంది. జాంపేట వద్ద బిర్యానీ సెంటర్లు, చికెన్ దుకాణాలను నెలవారీ మామూళ్లకు అలవాటు పడిన యంత్రాంగం చూసిచూడనట్లు వదిలేసినట్లు సమాచారం. ముఖ్యంగా పెద్ద దుకాణాల విషయంలో భారీగానే మామూళ్లు పిండేస్తున్నారు. రానున్న పుష్కరాల నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తు కార్యాచరణ దిశగా అడుగు వేస్తుంటే ఆదిలోనే హంస పాదు అన్నట్లు పరిస్థితి మారిపోయింది.


నగరంలో నడకదారి ఆక్రమణల తొలగింపు

# జిల్లా పోలీసులకు పురస్కారాలు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): కేసుల ఛేదన, విచారణ, దర్యాప్తులో మంచి ప్రతిభ కనబర్చిన జిల్లా పోలీసులకు పురస్కారాలు లభించాయి. ఈ మేరకు సోమవారం డీజీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఐపీఎస్ అధికారుల కేటగిరీలో ఎస్పీ డి.నరసింహకిషోర్‌ను డీజీపీ బ్రాంజ్(కాంస్యం) డిస్క్ పురస్కారం వరించింది. మధ్యప్రదేశ్, ఒడిశా ముఠాలను పట్టుకోవడం, నేర నియంత్రణ, తదితర అంశాల అమల్లో ప్రతిభ చాటడంతో ఈ పురస్కారం దక్కింది.

❖ డీజీపీ సిల్వర్ డిస్క్ పురస్కారానికి ఏఆర్ కానిస్టేబుళ్లు దినేష్ వీర్రాజు, భానువర్మ ఎంపికయ్యారు. ❖ డీజీపీ బ్రాంజ్ డిస్క్ పురస్కారానికి నాగదుర్గాప్రసాద్(ఎస్సై, కడియం), నాగరాజు(హెడ్ కానిస్టేబుల్, ప్రకాశంనగర్), మాధవ్(ఏఆర్ కానిస్టేబుల్), త్రిమూర్తులు (కానిస్టేబుల్, బిక్కవోలు), నరేష్(కానిస్టేబుల్, గోకవరం), ఎస్.వీరబాబు, కె.ప్రదీప్‌కుమార్(కానిస్టేబుల్స్, ప్రకాశంనగర్ పీఎస్) ఎంపికయ్యారు.

# నేటి నుంచి కొవ్వూరులో రెండు రైళ్లకు హాల్ట్

కొవ్వూరు పట్టణం: సుదీర్ఘ కాలం తర్వాత కొవ్వూరు స్టేషన్లో రెండు రైళ్లకు హాల్ట్ ఇవ్వనున్నారు. ఈనెల 18న రైల్వే బోర్డు చేసిన ప్రకటన నేపథ్యంలో మంగళవారం మచిలీపట్నం- విశాఖపట్టణం, విశాఖపట్టణం- కడప (తిరుమల) వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లు కొవ్వూరులో ఆగనున్నాయి. భాజపా నాయకులు మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఈ రెండు రైళ్లను జెండా ఊపి ప్రారంభిస్తారని తెలిపారు.

# ఈవీ ఛార్జింగ్.. ఇకపై ఈజీగా..

## ప్రభుత్వ స్థలాల్లో స్టేషన్ల ఏర్పాటుకు కసరత్తు

న్యూస్‌టుడే, కంబాలచెరువు, దేవీచౌక్(రాజమహేంద్రవరం)

కాలుష్య నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈవీ(ఎలక్ట్రిక్ వాహన) వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నాయి. దానికి తగ్గట్లుగా ఇంధన ధరలకు భయపడి ప్రజలు విద్యుత్తు వాహనాల వైపు అడుగులేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో విద్యుత్తు వాహనాల వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. వాటికి అనుగుణంగా ఛార్జింగ్ స్టేషన్లు లేకపోవడంతో కొంతమేర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఏపీ ఈపీడీసీఎల్ పీఎం ఈ-డ్రైవ్ పథకంలో కొత్తగా ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు కసరత్తు చేస్తోంది. ముందుగా ప్రభుత్వ కార్యాలయాల్లోని ఖాళీస్థలాల్లో వీటిని అందుబాటులోకి తేనున్నారు. కేటగిరీ-ఏ కిందకు వచ్చే కలెక్టరేట్, నగరపాలక సంస్థ, ఆర్టీసీ, ప్రభుత్వ కళాశాలలు తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తారు.


రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఛార్జింగ్ కేంద్రంలో ఈవీ

### వాహనాలు పెరిగినా.. ఛార్జింగ్ స్టేషన్లు లేక..

జిల్లాలో గత అయిదేళ్లతో పోల్చితే ఈవీల వినియోగం విపరీతంగా పెరిగింది. అయిదేళ్ల క్రితం కేవలం 2వేల లోపే ఉన్న వాహనాలు ప్రస్తుతం అన్ని రకాలు కలిపి 9,009కు పెరిగాయి. ఈవీల కొనుగోలుకు ఎక్కువ మంది ఆసక్తి కనబరుస్తున్నా బడ్జెట్ ధరల్లో వాహనాలు లేకపోవడం, ఛార్జింగ్‌కు ఇబ్బందులు ఎదురవడం వంటి సమస్యలున్నాయి. ఇంటి దగ్గర ఛార్జింగ్ పెట్టుకుంటే అధిక విద్యుత్తు బిల్లుతో సంక్షేమ పథకాలు ఆగిపోతాయని కూడా కొందరు భయపడుతున్నారు. ఛార్జింగ్ స్టేషన్లు విరివిగా అందుబాటులోకి వస్తే ఈవీల వైపు అంతా అడుగేస్తారు.

**రాజమహేంద్రవరం డివిజన్**
అన్నిరకాలు: 2,847
బ్యాటరీ ఆధారితం: 4,581

**కొవ్వూరు డివిజన్**
అన్నిరకాలు: 594
బ్యాటరీ ఆధారితం: 987

ఒక కారు ఛార్జింగ్‌కు వినియోగించే విద్యుత్తు: **సుమారు 30 యూనిట్లు**

ఒక యూనిట్‌కు వసూలు చేసే ఛార్జి: **రూ.21-23**

### ఈ ప్రాంతాల్లో..

గతంలో 100 శాతం రాయితీ ఇస్తామని ప్రతిపాదించినా, ప్రస్తుతం 80 శాతం ఇస్తామని చెబుతున్నారు. జిల్లాలోని రాజమహేంద్రవరం గ్రామీణం బొమ్మూరు, హుకుంపేట పంచాయతీలు, రాజమహేంద్రవరం నగరంలోని మున్సిపల్ కార్యాలయం, లూథర్‌గిరి సచివాలయం, పంచాయతీ రాజ్ డివిజన్ కార్యాలయం, లాలాచెరువు సబ్‌స్టేషన్, కంబాలచెరువులోని హైటెక్‌బస్టాండ్, నల్లజర్లలోని సబ్‌స్టేషన్, రాజానగరంలోని దివాన్‌చెరువు సబ్‌స్టేషన్, కోరుకొండలోని సబ్‌స్టేషన్ ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నారు.

## బతుకు దైన్యం..!



తల్లి చంకనున్న ఇతడు బాలుడు కాదు.. 23 ఏళ్ల యువకుడు. పేరు ఇష్టంశెట్టి ధనుష్‌దత్తా. పుట్టుకతో బహుళ వైకల్యం(మల్టీ డిసేబుల్)తో బాధపడుతున్నారు. ఊరు చాగల్లు మండలం ఊనగట్ల. నడవలేడు.. మాట్లాడలేడు. మంచానికే పరిమితమైన ఇతడికి తల్లి శ్రీలక్ష్మి సపర్యాలు చేస్తున్నారు. ఇతడిని తీసుకుని సోమవారం కలెక్టరేట్‌కు వచ్చారు. తన బిడ్డకు సాధారణ దివ్యాంగులకు ఇచ్చే రూ.6 వేలే ఇస్తున్నారని వాపోయారు. రూ.15 వేల పింఛను మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతూ జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌లో ఉన్నతాధికారులకు ఆమె అర్జీ అందించారు.

\- న్యూస్‌టుడే, కలెక్టరేట్(రాజమహేంద్రవరం)

## పుడమికి జీవం.. రైతుకు క్షేమం

జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని తూర్పుగోదావరి జిల్లా రంగంపేటలో దేవిన సిస్టర్స్ సోహిత, ధన్యత రూపొందించిన సైకత శిల్పం అందరినీ ఆకట్టుకుంది. 'రసాయన ఎరువుల వాడకం తగ్గిద్దాం... పుడమికి ప్రాణం పోద్దాం' అనే నినాదంతో రెండు యూనిట్ల ఇసుకతో 12 గంటలపాటు శ్రమించి దీనికి రూపకల్పన చేశారు. విచ్చలవిడిగా రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకంతో కలిగే అనారోగ్యాలు, అనర్థాలపై అవగాహన కల్పించడానికి తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని వారు పేర్కొన్నారు.




\- న్యూస్‌టుడే, రంగంపేట

## బ్రహ్మోత్సవం.. ప్రణమిల్లిన భక్తజనం

తూర్పుతిరుమలగా ప్రసిద్ధి చెందిన బలభద్రపురంలో శ్రీదేవి, భూదేవి సహిత ప్రసన్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు తొమ్మిదో రోజుకు చేరాయి. బుధవారం రాత్రి స్వామివారు మలయప్పస్వామి అవతారంలో సింహవాహనంపై దర్శనమిచ్చారు. భక్తులు స్వామివారి వెంట భజనలు, కీర్తనలు పాడుతూ కదిలారు. పలువురు దేవాలయం వద్ద స్వామివారికి హారతులు ఇచ్చి 9 ప్రదక్షణలు చేయించారు.



\- న్యూస్‌టుడే, బిక్కవోలు

# చేయి తడిపితేనే చేను చూసేది!

## కట్టు తప్పుతున్న సర్వేయర్లు

ఈనాడు, కాకినాడ

రెవెన్యూలో కీలకమైన సర్వే శాఖ గాలుసు తప్పుతోంది. బాధితుల అవసరాలను సొమ్ము చేసుకుంటున్నారు. పైసలిస్తేనే పొలంలోకి వస్తున్నారు. లేకుంటే నెలలు తరబడి కాలయాపన చేస్తూ రైతులను తిప్పుతున్నారు. కొందరు భూమిలోకి వెళ్లకుండానే సర్వే చేసినట్లు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సైతం తప్పుబడుతున్నారు. ఇటీవల వివిధశాఖల తీరుపై ప్రభుత్వం సేకరించిన సంతృప్తిస్థాయి నివేదికల్లో సర్వేయర్ల తీరుపై అంతటా పెదవివిరుపే వినిపిస్తుంది.


సర్వే చేస్తున్న సిబ్బంది

**ఇదీ పనితీరు..**

| జిల్లాలో పరిస్థితి (శాతాల్లో) | అవును | లేదు |
|---|---|---|
| సర్వేయర్ మీకు నోటీసు ఇచ్చారా? | 60.9 | 39.1 |
| క్షేత్రస్థాయికి వచ్చి సర్వే చేశారా..? | 72.5 | 27.5 |
| సర్వేయర్‌కి డబ్బులు ఇచ్చారా? | 25 | 75 |

### వారికి ఇక్కట్లు.. వీరికి కాసులు

గత ప్రభుత్వంలో చేపట్టిన భూముల రీసర్వే రైతులను చిక్కుల్లోకి నెట్టింది. సాగు విస్తీర్ణం తగ్గించి చూపడం, పట్టా భూములను అసైన్డ్ భూములుగా నమోదు చేయడంతో మరలా సర్వేలు చేయించాల్సి వస్తోంది. జాయింట్ ఎల్‌పీఎం సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. ఒక సర్వే నంబర్‌లోని భూమి మొత్తం ఒకే రైతు పేరుపై చూపడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమైపోతున్నారు. వీటిపై అర్జీలు ఎక్కువగా రావడంతో జాయింట్ ఎల్‌పీఎంలను సబ్ డివిజన్ చేయడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇక్కడే సర్వేయర్లు చేతివాటం చూపుతున్నారు.

● బిక్కవోలు మండలం బలభద్రపురం సచివాలయం పరిధిలో నిర్వహించిన సర్వేలో మీ అర్జీకి సర్వేయర్ నోటీసు ఇస్తున్నారా అని అడిగితే నూరు శాతం ఇవ్వలేదనే సమాధానం

**సర్వేశాఖాపరంగా సంతృప్తిస్థాయిల్లో జిల్లాల ర్యాంకులు**

| | |
|---|---|
| కాకినాడ | 7 |
| తూర్పుగోదావరి | 18 |
| కోనసీమ | 14 |

# ఆరుగురు వ్రత పురోహితుల సస్పెన్షన్

అన్నవరం, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న ఆరుగురు వ్రత పురోహితులను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఈవో వి.త్రినాథరావు సోమవారం ఆదేశాలిచ్చారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో నిర్వహించిన సామూహిక ఉచిత సత్యనారాయణ స్వామి వ్రతాల్లో భక్తుల నుంచి దానాల పేరుతో సొమ్ము వసూలు చేశారనే అభియోగాల కింద వీరిని విధుల నుంచి తప్పించారు. మంత్రి నిమ్మల రామానాయుడు సిఫార్సుతో ధర్మప్రచారంలో భాగంగా పాలకొల్లులో గోవింద మాల భక్త సంఘం ఆధ్వర్యంలో సామూహిక వ్రతాలు ఆదివారం ఉదయం నిర్వహించారు. అన్నవరం నుంచి ఆరుగురు పురోహితులు వెళ్లి వ్రత పూజ నిర్వహించారు. వ్రత కథ పూర్తైన తర్వాత అన్నదానం, వస్త్రదానం పేరుతో భక్తుల నుంచి రూ.501, రూ.251 దక్షిణగా సొమ్ములు వసూలు చేశారు. దీనిపై ఫిర్యాదు అందడంతో విచారించి నిర్ధారణ కావడంతో పురోహితులు మంతా శ్రీరామమూర్తి, ప్రయాగ ఆంజనేయులు, తొయ్యేటి వెంకట నరసింహ హరనాథ సుబ్రహ్మణ్యం, మల్లాది గురుమూర్తి, పాలంకి సోమేశ్వరరావు, మొక్కరాల సతీష్‌లను సస్పెండ్ చేశారు. వ్రత గుమస్తా బీఎస్ఎన్ రాజుకు ఛార్జిమెమో ఇచ్చి 10 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని, లేకుంటే తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# 'మట్టికి రెక్కలు' నిజమే..!

## రెండు యంత్రాలు, లారీ స్వాధీనం

ఈనాడు కథనానికి స్పందన

ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, గోకవరం : గోకవరం మండలం గంగవరం, రంప యర్రంపాలెంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు వాస్తవమేనని భూగర్భగనుల శాఖ అధికారులు నిర్ధారించారు. రెండు గ్రామాల్లో 6,873 క్యూబిక్ మీటర్ల మట్టిని అక్రమంగా తరలించినట్లు తేల్చారు. 'మట్టికి రెక్కలు' శీర్షికన 'ఈనాడు'లో సోమవారం ప్రచురితమైన కథనానికి జిల్లా మైన్స్ అధికారి ఫణిభూషణ్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించి అనుమతులు లేకుండా తవ్వకాలు చేస్తున్నట్లు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో రెండు ప్రొక్లెయిన్లు, లారీ, స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత భూయజమానులకు నోటీసులు జారీ చేస్తామని అధికారులు వెల్లడించారు. అనధికార తవ్వకాలపై శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని మైన్స్ అధికారి ఫణిభూషణ్ రెడ్డి తెలిపారు.


శిక్షణ కానిస్టేబుళ్లతో ఎస్పీ నరసింహకిషోర్, అధికారులు

# చిత్తశుద్ధితో శిక్షణ పూర్తి చేసుకోవాలి: ఎస్పీ

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ట్రైనీ కానిస్టేబుళ్లు క్రమశిక్షణతో శిక్షణ పూర్తి చేసుకోవాలని ఎస్పీ డి.నరసింహకిషోర్ సూచించారు. శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించగా ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నక్సలిజాన్ని రూపుమాపడంలో ఏపీఎస్పీ పాత్ర కీలకమన్నారు. నాలుగో బెటాలియన్ కమాండెంట్, శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ పి.సత్తిబాబు మాట్లాడుతూ శిక్షణలో శారీరకంగానే కాకుండా మానసింగా, నైతికంగా బాధ్యతాయుతమైన పోలీసును తయారు చేయడమే లక్ష్యమన్నారు. ఏఎస్పీ ఎల్.చెంచిరెడ్డి, అదనపు కమాండెంట్ వీవీవీ సత్యనారాయణ, సహాయ కమాండెంట్ టి.నాగ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు కె.నరసింహారావు, జె.శ్రీనివాసరావు, కాశీ విశ్వనాథం, సుబ్రహ్మణ్యేశ్వర రావు పాల్గొన్నారు.


**SHRIRAM Finance**

# శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

నమోదిత కార్యాలయం : శ్రీటవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్‌ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032. వెబ్‌సైట్: http://www.shriramfinance.in./auction
కార్యాలయ చిరునామా : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, జోనల్ కార్యాలయం, డి.నెం. 6-12-5/1, 2వ అంతస్తు, ఓరుగంటివారి స్ట్రీట్, ఇన్నీస్‌పేట, కోటిపల్లి బస్టాండ్ ఎదురుగా, రాజమహేంద్రవరం-533101 మరియు శాఖ కార్యాలయం నిడదవోలు.

**శ్రీ పోతుల సూర్యచంద్ర ప్రసాద్ కి చెందిన స్థిరాస్తులకు సంబంధించి ఇ-వేలం అమ్మకం ప్రకటన**

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002 మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని నిబంధన 9(1) & 8(6) ప్రకారం స్థిరాస్తుల విక్రయానికి ఈ-వేలం విక్రయ నోటీసు.
సాధారణ ప్రజలకు మరియు ముఖ్యంగా ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీత మరియు హామీదారు/తనఖాదారులకు తెలియజేయునది ఏమనగా, సెక్యూర్డ్ క్రెడిటర్ (శ్రీరామ్ ఫైనాన్స్) వద్ద తాకట్టు పెట్టబడిన ఈ క్రింద వివరించిన స్థిరాస్తిని, "ఎక్కడ ఉంటే అక్కడ", "ఏ స్థితిలో ఉంటే ఆ స్థితిలో" మరియు "ఏమి ఉంటే అది" ప్రాతిపదికన **29.01.2026 నాడు ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 01.00 గంట వరకు విక్రయించబడును.** SARFAESI చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (సెక్యూర్డ్ క్రెడిటర్) వారు రుణగ్రహీత/హామీదారు(ల)కు జారీ చేసిన 25.01.2023 తేదీనాటి డిమాండ్ నోటీసు తేదీ ప్రకారం, 25.01.2023 నాటికి బాకీ ఉన్న **రూ.67,39,502/-** మరియు 26.01.2023 నుండి తదుపరి వడ్డీ, ఇతర ఖర్చులు రాబట్టుకొనుట కొరకు ఈ వేలం నిర్వహించబడుతుంది.
**అగ్రిమెంట్ నెం. NDVL1TF1905290008**
**రుణగ్రహీత/హామీదారుల పేర్లు మరియు చిరునామాలు:**
1. **పోతుల సూర్య చంద్రప్రసాద్, తండ్రి:** నాగేశ్వరరావు, ప్రైవేట్ ఉద్యోగి, డి.నెం.13-6-8, గ్యాస్ కంపెనీ స్ట్రీట్, కొవ్వూరు, పశ్చిమ గోదావరి జిల్లా-534350. **(ఋణగ్రహీత)**
2. **బండి పల్లి నాగ రమ్యలక్ష్మి, తండ్రి:** బండి శ్రీనివాసరావు, గృహిణి, డి.నెం.13-6-8, గ్యాస్ కంపెనీ స్ట్రీట్, కొవ్వూరు, పశ్చిమ గోదావరి జిల్లా-534350. **(హామీదారు)**
3. **పోతుల వెంకట రామకృష్ణ, తండ్రి:** నాగేశ్వరరావు, అంజని చిట్స్ యజమాని, డి.నెం.13-6-8, గ్యాస్ కంపెనీ స్ట్రీట్, కొవ్వూరు, పశ్చిమ గోదావరి జిల్లా-534350. **(హామీదారు)**
**స్థిరాస్తి వివరణ (పోతుల సూర్య చంద్రప్రసాద్ గారికి చెందిన ఆస్తి):**
**ఎ-షెడ్యూలు:** పశ్చిమ గోదావరి జిల్లా, కొవ్వూరు మండలం, కొవ్వూరు సబ్-జిల్లా, కొవ్వూరు మునిసిపల్ ఏరియా మరియు గ్రామ ఖాతాలు, 21వ వార్డు, డి.నెం.4-4-20, ఆర్.యస్.నెం.638/7 నందు 3339.6 చ॥గ॥లలో తూర్పు దిశలో 2201.21 చ॥గ॥ స్థలము. **దీనికి హద్దులు: తూర్పు:** మునిసిపల్ రోడ్డు; **దక్షిణం:** దుద్దుపూడి సత్యనారాయణ యొక్క స్థలము; **పడమర:** దేశబత్తుల సుప్రియ యొక్క స్థలము; **ఉత్తరం:** పరిమి రామారావు యొక్క ఇల్లు. **ఈ హద్దుల మధ్యలోని 2201.21 చ॥గ॥ విస్తీర్ణములో అవిభాజ్యపు మరియు అనిర్దిష్టపు భాగమైన 355.54 చ॥గ॥ లేదా 297.277 చ॥మీ॥ స్థలములో అవిభాజ్యపు మరియు అనిర్దిష్టపు భాగమైన 50.79 చ॥గ॥ లేదా 42.467 చ॥మీ॥ స్థలము.**
**బి-షెడ్యూలు:** డి.నెం.4-4-20/104, అసెస్‌మెంట్ నెం. 1076009643, ఆర్.యస్.నెం. 638/7, పైన పేర్కొన్న షెడ్యూలులో భవ్య గ్రాండ్ రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉత్తరదిశలో 1015 చ॥అ॥ ఫ్లింత్ ఏరియాలోని డబుల్ బెడ్‌రూమ్ **ఫ్లాట్ నెం.104**కు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు: తూర్పు:** లిఫ్ట్ మరియు శూన్యాకాశము; **దక్షిణం:** ఉమ్మడి వరండా; **పడమర:** మెట్లు మరియు ఉమ్మడి వరండా; **ఉత్తరం:** శూన్యాకాశము. **ఈ హద్దుల మధ్యలోని 88 చ॥గ॥ విస్తీర్ణములో 1/3వ వంతు అవిభాజ్యపు మరియు అనిర్దిష్టపు భాగమైన 29¹/₃ చ॥గ॥లు మిగిలిన 2/3వ వంతు వాటా 58²/₃ చ॥గ॥ స్థలములో అన్ని సులభతర హక్కులతో సహా.**
(కొవ్వూరు సబ్ రిజిస్ట్రార్ నందు బహుమతి సెటిల్‌మెంట్ డీడ్ దస్తావేజు నెం.2453/2019 మరియు విఘ్నేశ్వరపురం సబ్ రిజిస్ట్రార్ నందు దస్తావేజు నెం.1677/2019 ప్రకారము తనఖావుంచిన ఆస్తి)
**ఆస్తిపై ఉన్న రుణభారాలు: ఏమీ లేవు.**

| అగ్రిమెంట్ నెం. | ఆస్తి రిజర్వ్‌ధర | EMD మొత్తము: | EMD చెల్లింపు విధానం | బిడ్ పెంపుదల మొత్తం | వేలం తేదీ & సమయం | EMD చెల్లించడానికి చివరి తేదీ | ఆస్తి తనిఖీ తేదీ. |
|---|---|---|---|---|---|---|---|
| NDVL1TF1905290008 | రూ.28,77,120/- (అక్షరాల ఇరవై ఎనిమిది లక్షల డెబ్బై ఏడు వేల నూట ఇరవై రూపాయలు మాత్రమే) | రూ.2,87,712/- (అక్షరాల రెండు లక్షల ఎనభై ఏడు వేల ఏడు వందల పన్నెండు రూపాయలు మాత్రమే) | డిడి రూపంలో "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్" పేరిట తీయవలెను | రూ. 10,000/- | 29.01.2026 ఉ. 11.00 గం. నుండి మ. 01.00 గం. వరకు | 28.01.2026 | 27.01.2026 |

ఆసక్తి గల బిడ్డర్లు లాగిన్ ఐడి & పాస్‌వర్డ్ సృష్టించుకోవడం, డేటా అప్‌లోడ్ చేయడం, బిడ్ సమర్పించడం, ఈ-బిడ్డింగ్ ప్రక్రియపై శిక్షణ మొదలైన వాటి కోసం M/s.శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్, **కాంటాక్ట్ పర్సన్: శ్రీ గౌరవ్ నంబూదిరి ఫోన్: 9833922941,** ఈమెయిల్: శ్రీ గౌరవ్ నంబూదిరి <gaurav.n@samil.in> వారిని సంప్రదించవచ్చు. ఆస్తికి సంబంధించిన సందేహాల కోసం శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ ఆథరైజ్డ్ ఆఫీసర్, **డి. రామ్ మోహన్, ఫోన్: 9849824075** నంబరులో ఆఫీసు వేళల్లో మరియు పని దినాలలో సంప్రదించవచ్చు. ఎటువంటి కారణం చూపకుండా ఏవైనా లేదా అన్ని బిడ్లను తిరస్కరించే హక్కు అధీకృత అధికారికి ఉంది. ఆన్‌లైన్ వేలం మా ఏజెన్సీ అయిన శ్రీరామ్ ఆటో మాల్ ఇండియా లిమిటెడ్ వారి వెబ్‌సైట్ **(https://eauctions.Samil.in/home)** లో నిర్వహించబడుతుంది. టెండర్ సమర్పణ, బిడ్ ఫారం పొందడం మరియు పూర్తి నిబంధనల కోసం **https://eauctions.Samil.in/home** లేదా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వెబ్‌సైట్‌లోని **https://www.shriramfinance.in/auction** లింక్‌ను చూడగలరు.
**గమనిక:** NCLT, చెన్నై వారి ఆదేశాల మేరకు శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్, శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌లో విలీనం చేయబడింది అని దీని ద్వారా తెలియజేయడమైనది. తదుపరి, పేరు మార్పుకు సంబంధించి 30-11-2022 నాడు జారీ అయిన సర్టిఫికేట్ ఆఫ్ ఇన్‌కార్పొరేషన్ ప్రకారం, 30.11.2022 తేదీ నుండి అమలులోకి వచ్చేలా శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ పేరు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా మార్చబడింది.
**ప్రదేశము: రాజమండ్రి, తేది: 22.12.2025** సం/-అధీకృత అధికారి



**డెల్టా క్యాన్సర్ సెంటర్**
A Unit of Rajamahendri Healthcare Private Limited

క్యాన్సర్‌ను
ముందుగానే గుర్తించండి.
సురక్షితంగా జీవించండి.



నిష్ణాతులైన వైద్య నిపుణులు
అత్యాధునికమైన సాంకేతికతతో
సర్జికల్ ఆంకాలజీ | మెడికల్ ఆంకాలజీ | రేడియేషన్ ఆంకాలజీ
వెంకటేశ్వర నగర్, రాజమండ్రి. ✆ 9 613 613 613





కీ॥శే॥ శ్రీ కంటిపూడి వీర్రాజు చౌదరి గారు
Ex.చైర్మన్: SRMT Ltd. Kakinada
జననం: 23-12-1928, మరణం: 13-11-2001

**97వ జయంతి**

SRMT చౌదరిగా అందరి హృదయాలలో చెరగని ముద్ర వేసుకొని, అణువణువునా ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని నింపుకొని, అనుయాయులకు ఆరాధ్య దైవంగా, చిరునవ్వే ఆభరణంగా పరిమళించిన

**శ్రీ K.V.R. చౌదరి గారు**

'తూ॥గో॥ జిల్లా కమ్మ మహాజన సంఘం'ను స్థాపించి, ఈ సంఘము యొక్క శాఖ "శ్రీ చారిటబుల్ సర్వీస్ ట్రస్ట్" ద్వారా ప్రతి సంవత్సరం ఉన్నత విద్యలో ఉత్తమ ప్రతిభ కనబరచిన పేద విద్యార్థినీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల ద్వారా ఆర్థిక సహాయం అందించుటలో ఆ మహనీయుని సేవలు ఎన్నటికీ మరువలేము.

నేడు వారి 97వ జయంతి సందర్భంగా వారి ఆశయాలు, ఆదర్శాలు మాకు స్ఫూర్తిదాయకం. సదా వారి స్మరణలో...

కార్యనిర్వాహక సభ్యులు
**తూర్పుగోదావరి జిల్లా కమ్మ మహాజన సంఘం**
సిద్దార్థ నగర్, కాకినాడ - 533 003, ఫోన్: 0884-2374327


(c) eenadu